ఉమ్మడి జిల్లాకు కొత్త పోలీస్ బాస్‌లు

- కరీంనగర్, రామగుండం సీపీలు, రాజన్న సిరిసిల్ల ఎస్పీ బదిలీ
- పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కొత్త పోలీస్ బాస్‌లు రాబోతున్నారు. కరీంనగర్, రామగుండం సీపీలుగా గౌష్ ఆలం, అంబర్ కిశోర్ ఝా, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా మహేశ్ బాబా సాహెబ్ గిటె నియమితులయ్యారు. పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్ రానున్నారు.

కరీంనగర్ సీపీగా గౌష్ ఆలం

కరీంనగర్, మార్చి 7(నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన అభిషేక్ మొహంతి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు వెళ్లిపోయారు. ఆయనను కేంద్ర హోంశాఖ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయిస్తూ గత నెలలోనే ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రిలీవ్ కావడానికి వీలు లేకుండా పోయింది. ఎన్నికల కోడ్ ముగుస్తున్న నేపథ్యంలో ఏపీ క్యాడర్‌కు కేటాయించిన మరికొందరు ఐపీఎస్ అధికారులను తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన అనూహ్య బదిలీలో భాగంగా అభిషేక్ మొహంతి కరీంనగర్ సీపీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి తనదైన శైలిని కనబరుస్తూ విధులు నిర్వహించారు. భూకబ్జా కేసులు, ఆర్థిక నేరాలపై అభిషేక్ మొహంతి ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన స్థానంలో 2017 ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన గౌష్ ఆలంను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన మంచి అధికారిగా గుర్తింపు పొందారు. నకిలీ పత్తి విత్తనాలు, గంజాయి, దేశీదారు మద్యం, మట్కాపై ఉక్కుపాదం మోపి కట్టడి చేశారు. మహారాష్ట్ర సరిహద్దు నుంచి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. నేరాల నియంత్రణలో తనదైన ముద్ర వేశారు. ప్రస్తుతం సీపీగా వస్తున్న ఆయన, త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

రామగుండం సీపీగా అంబర్ కిశోర్ ఝా

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 7 : రామగుండం పోలీస్ కమిషనర్‌గా అంబర్ కిశోర్ ఝా రానున్నారు. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన, గతేడాది ఫిబ్రవరిలో డీఐజీగా పదోన్నతి పొంది రాచకొండ జాయింట్ సీపీగా పనిచేశారు. ప్రస్తుతం వరంగల్ సీపీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం రామగుండం సీపీగా పనిచేస్తున్న ఎం శ్రీనివాస్ సీఐడీ ఐజీగా బదిలీ అయ్యారు. 2024 ఫిబ్రవరి 12న జాయిన్ అయిన ఆయన, 13 నెలల పాటు పనిచేశారు. అలాగే, పెద్దపల్లి డీసీపీగా పనిచేస్తున్న చేతనను మహిళా భద్రత విభాగం ఎస్పీగా బదిలీ చేయగా, ఆమె స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న నాన్ క్యాడర్ ఎస్పీ కరుణాకర్‌ను నియమించారు.

రాజన్న సిరిసిల్ల ఎస్పీగా మహేశ్ బాబా సాహెబ్ గిటె

రాజన్న సిరిసిల్ల, మార్చి 7(నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ములుగు జిల్లా ఓఎస్డీగా విధులు నిర్వర్తిస్తున్న మహేశ్ బాబా సాహెబ్ గిటె నియామకమయ్యారు. బదిలీపై వెళ్లిన అఖిల్ మహాజన్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆటోలో ప్రయాణించే వారికి రక్షణగా అభయ యాప్, క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళల రక్షణ కోసం పోలీస్ అక్క, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పేరిట షీటీంలను సమర్థవంతంగా నిర్వహించారు. బస్సులో ప్రయాణించే వారికి బస్సులో భరోసా కార్యక్రమాలతో ప్రతి బస్సులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. పోలీసుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు క్రీడా పోటీలు నిర్వహించారు.

నమస్తే తెలంగాణ

జగిత్యాల

3 | కరీంనగర్, శనివారం 8 మార్చి 2025 | JAGTIAL

బీఆర్ఎస్ ఆవిర్భవించి ఏప్రిల్27 తేదీకి 25 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో ఎర్రవెల్లిలోని నివాసంలో అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా నుంచి మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు.

కరీంనగర్‌లో ప్రాపర్టీ షో నేడే

- శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపం వేదికగా రెండు రోజుల పాటు ఎక్స్ పో
- ఉదయం 10గంటలకు ప్రారంభం • పాల్గొననున్న ప్రముఖ రియల్ ఎస్టేట్ రంగ సంస్థలు, బ్యాంకులు
- సందర్శకులకు ప్రవేశం ఉచితం

రాజరాజేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటవుతున్న స్టాళ్లు

కార్పొరేషన్, మార్చి 7: 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో కరీంనగర్‌లో రెండు రోజులపాటు ప్రాపర్టీ షో నిర్వహించనున్నారు. కోర్టు చౌరస్తాలోని శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపం వేదికగా శనివారం ఉదయం 10 గంటలకు ఈ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. శని, ఆదివారాల్లో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7గంటల వరకు నిర్వహించనున్నారు. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ రంగ సంస్థలు, గృహ నిర్మాణ సంస్థలు, బ్యాంకులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, రెడీమేడ్ ఇండ్లు, విల్లాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, ఇండ్ల నిర్మాణాలకు అయ్యే వ్యయం, బ్యాంకు రుణాలు ఇలా అన్ని వివరాలను ప్రతినిధులు అందించనున్నారు. నిర్మాణ రంగానికి సంబంధించిన పూర్తి సమాచారం ఒకే వేదికగా తెలుసుకునే అవకాశం ఈ ప్రాపర్టీ షో కల్పిస్తుండగా, సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించారు.

కొత్త ట్రెండ్.. యూపీవీసీ షీట్స్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 7 : నిర్మాణ రంగంలో యూపీవీసీ (ఏఎస్ఏ) రూపింగ్ షీట్స్ కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి. పేద మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కొన్ని దేశ, విదేశాల్లోని కంపెనీలు వీటిని రూపొందిస్తున్నాయి. నివాసయోగ్యమైన షెడ్లూ, పెంట్‌హౌస్‌లు, ఫామ్‌హౌస్‌లు, పశువుల పాకలు, ఫ్లాట్‌ఫాంలు, గొర్రెల షెడ్లూ ఇలా ప్రతి అవసరానికి అనుగుణంగా తయారవుతున్నాయి. ట్రైల్స్, ట్రోఫో ప్రొఫైల్స్ మోడల్స్‌లో మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో వీటి వాడకం పెరగడంతో సాధారణ రేకుల అమ్మకాలు కాస్త మందగించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇవి పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయని, బయటి నుంచి వచ్చే వేడిని తగ్గించి ఇంటిలో చల్లదనం ఇస్తాయంటున్నాయి. ఇవి అగ్ని ప్రమాదాల నుంచి తట్టుకోవడంతోపాటు చెదలు రాదని, 30 ఏండ్ల వరకు చెక్కు చెదరకుండా ఉంటాయంటున్నాయి.